క్లుప్తంగా

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో పాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



షిర్డీసాయికి పూజలు చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు, అభిషేకాలు, తీర్థ ప్రసాదాల వినియోగం, అర్చనలు, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి శేజ్‌హారతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ముగిసిన అక్కమ్మ దేవతల జాతర



కరుట్లపల్లిలో అలంకరణలో అక్కమ్మ దేవతలు

కూడేరు: మండలంలోని కరుట్లపల్లిలో రెండు రోజులుగా కనుల పండువగా సాగిన అక్కమ్మ దేవతల జాతర గురువారం వసంతోత్సవంతో ముగిసింది. అక్కమ్మ దేవతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. అక్కమ ఆలయం వద్దకు పెద్ద ఎత్తున గ్రామస్తులు తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండేలా చూడు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



రామాలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న పురోహితులు

కూడేరు: కూడేరులోని కోదండ రామాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేసి, వ్రతం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. వ్రతాన్ని ఆచరించడం ద్వారా దుఃఖాలు తొలగి, ధనధాన్యాభివృద్ధి, సంతాన సౌభాగ్యం కలుగుతుందన్నారు. వత్రం అనంతరం భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పెన్నహోబిలంలో తాగునీటి సౌకర్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులు కోసం తాగునీటి సౌకర్యార్థం నూతన బోరును గురువారం ఏర్పాటు చేశారు. నూతన బోరుకు ఆలయ ఈఓ విజయ్‌కుమార్ భూమి పూజ చేశారు. షేక్షానుపల్లి పంచాయతీ నుంచి నిధులు మంజూరు చేశారు.

సాయి, రాఘవేంద్రస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయినాథుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాల్లో గురువారం భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయి ఆలయంలో స్వామికి మంగళహారతి, అర్చనలు చేశారు.

ఫలించిన వ్యూహం.. ఎన్నికలు ప్రశాంతం

- డివిజన్‌లో ఒక్క కేసూ నమోదుకాని వైనం
- కౌంటింగ్ రోజు శాంతియుత వాతావరణం కల్పించేలా చర్యలు



పోలీసులతో కలిసి కవాతు నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

డివిజన్‌లో బైండోవర్లు	2,579
లైసెన్స్‌డ్ ఆయుధాలు	70
స్వాధీనం చేసుకున్న ఆయుధాలు	61
సీజ్ చేసిన నగదు	రూ. 1.64 కోట్లు
చెక్‌పోస్టులు	17

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే చాలు..పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు, కార్యకర్తల మధ్య గొడవలు.. రాజకీయ నాయకుల కవ్వింపులు .. బెదిరింపులు.. ఇలా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవి ఎన్నో .. పోలింగ్ ముగిసేవరకూ పోలీసులు, అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. అయితే ఈనెల 13న ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు అధికారులు తీసుకున్న చర్యలు కూడా ఫలించాయి. ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని 2 అర్బన్ పీఎస్ లతో పాటు 11 మండల పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని పోలీసుశాఖ ముందస్తుగా పన్నిన వ్యూహరచన విజయవంతం దిశగా నడిపించింది. ఈ సారి రాజకీయ పార్టీలను బాగస్వామ్యం చేస్తూ పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిపేలా పటిష్టమైన ప్రణాళికలను అమల్లోకి తీసుకొచ్చింది. అశాంఘీక శక్తులపై ఉక్కుపాదం మోపింది.

సమస్యాత్మక గ్రామాలపై డేగ కన్ను..

రాయదుర్గంలో 296 పోలింగ్ బూత్‌లు, వాటి పరిధిలో 34, కళ్యాణదుర్గంలో 261 పోలింగ్ కేంద్రాలు, వాటి పరిదిలోని 24 సమస్యాత్మక గ్రామాలను పోలీసులు ముందస్తుగా గుర్తించారు. పోలింగ్ రోజు ఏ చిన్న సమస్య ఉత్పన్నం కానీకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. షెడ్యూల్ వెలువడినప్పటి నుండే ఆ గ్రామాల్లో జరిగే రాజకీయ కార్యాకలాపాలపై డేగ కన్ను వేసి ఉంచారు. ఎక్కడ ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా సత్వరం పరిష్కరిస్తూ రాజీమార్గం దిశగా అడుగులు వేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో డీఎస్పీలు బీ శ్రీనివాసులు, నరసింగప్ప లు నోడల్ అధికారులుగా పర్యావేక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు నిఘాతో పాటు వెబ్‌కాస్టింగ్ ద్వారా లైవ్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రత్యేక బలగాలను అప్రమత్తం చేశారు. దీంతో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చేశారు.

పారా మిలటరీ బలగాల మోహరింపు..

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 557 పోలింగ్ బూత్‌లు, వాటి పరిధిలోని 57 రూట్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి నాలుగైదు కేంద్రాలను కలిపి ఒక క్లస్టర్‌గా రూపొందించారు. ప్రతి రూట్‌లో సంచార పోలీసు బృందాలను నియమించారు. స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పారామిలటరీ బలగాలను మోహరించారు. నిరంతరం ప్రతి కేంద్రాన్ని పర్యావేక్షించేలా పోలీసులు బృందాలను నియమించారు. రెండు జోన్ల పరిధిలోనూ సుమారు వెయ్యి మంది సిబ్బందిని వివిధ విభాగాల్లో కేటాయించి భద్రత చర్యలు పర్యావేక్షించారు. ఓటర్లు, పార్టీల కార్యకర్తలు ఎక్కడా గుంపులుగా చేరకుండా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేశారు.

ఈ ఎన్నికల్లో అంతా ప్రశాంతం..

గత 2019 ఎన్నికలు ఘర్షణ వాతారణం చోటు చేసుకున్నాయి. రెండు నియోజకవర్గాల్లోనూ పార్టీల మధ్య తలెత్తిన విభేదాలు కొట్టుకునే స్థాయికి చేరుకున్నాయి. పలు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన ఎన్నికలు యుద్ధవాతావారణం తలపించాయి. సుమారు 20కి పైగా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో 557 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం.

ప్రజల సహకారంతోనే సాధ్యం



ప్రజలు, రాజకీయపార్టీ నాయకుల సహకారంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగించాం. ప్రజలతో మమేకమై పోలీసులు పనిచేయడంతోనే ఇది సాధ్యమైంది. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా కృషి చేశాం. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో ముందస్తుగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాం. గట్టి భద్రత చర్యలు చేపట్టాం. రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీచేశాం. మారణాయుధాలను డిపాజిట్ చేసుకున్నాం. సరిహద్దు ప్రాంతాల్లో మద్యం, నగదు కట్టడితో పాటు బైండోవర్లు చేశాం. తద్వారా ప్రశాంత ఎన్నికలకు సాధ్యమైంది. వచ్చే నెల 4న వెలువడే ఎన్నికల ఫలితాల రోజు కూడా ప్రజలు, రాజకీయ నాయకులు సంయమనం పాటించాలి.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి



రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో చిన్న పాటి ఘర్షణలు కూడా తలెత్తలేదు. ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇది సంతోషకరమైన విషయం. ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు కూడా ఇలానే ప్రశాంత వాతావరణం ఉండాలి. ఏ పార్టీ గెలిచినా అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సమన్వయం పాటించాలి. గెలుపు, ఓటమి రెండూ సమానమే అన్న భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి. రాష్ట్రంలోనే కళ్యాణదుర్గం డివిజన్ అంటేనే ప్రశాంతతకు మారుపేరుగా చెప్పుకునేలా మెలగాలి. ఎన్నికల్లో ముందస్తుగా అమలుచేసిన ప్రతి వ్యూహం ఫలించింది.

– రాణీసుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రాయదుర్గం చేరిన పాఠ్యపుస్తకాలు

రాయదుర్గంటౌన్: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా కానుకలను జిల్లా కేంద్రం నుంచి మండల స్టాక్ పాయింట్లకు విద్యాశాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లోని స్టాక్ పాయింట్‌కు తొలి విడతలో నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. మరోరెండు మూడు రోజుల్లో మిగతా మెటీరియల్ కూడా సరఫరా చేయనున్నారు.

13,911 మందికి విద్యా కానుక లబ్ధి : రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 81 పాఠశాలల్లో చదివే 13,911 మంది విద్యార్థులకు విద్యా కానుక లబ్ధి చేకూరనుంది. 8 రకాల విద్యా కానుకలో భాగంగా ఇప్పటికే రెండు రకాల మెటీరియల్ స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సరిపడా 74,194 నోట్ పుస్తకాలు వంద శాతం సరఫరా కాగా, 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1,61,909 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, తాజాగా 43,796 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. మోడల్ స్కూల్‌లోని స్టాక్ పాయింట్‌కు సరఫరా అయిన విద్యా కానుక మెటీరియల్‌ను గురువారం ఎంఈఓ– 1 నాగమణి, ఎంఈఓ– 2 వెంకటరమేష్ పరిశీలించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అర్బన్, రూరల్ పరిధిలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేసేందుకు పాఠ్య పుస్తకాలను తరగతుల వారీగా వేరు చేసి, ఉంచినట్లు తెలిపారు.



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగమణి

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఈనెల 24 నుంచి పదోతరగతి, ఇంటర్మీయెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు 24 నుంచి జూన్ 3 వరకు జరగనుండగా, ఇంటర్ పరీక్షలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి.

7 కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు : పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు పట్టణంలోని 7 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పట్టణంలోని పీఆర్ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రెండు కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు : ఇంటర్మీయెట్ సప్లిమెంటరీ పరీక్షలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాళ్లు వీరేష్, తోట వెంకటేశులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా ఫస్టియర్‌కు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకిండియర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా కేవలం ఫస్టియర్ విద్యార్థులకు మాత్రమే పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

వజ్రకరూరు: వర్షాల పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిద్ధం కావాలని సూచించారు. వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూ డా లని కోరారు. తహసీల్దార్ మహమ్మద్ రఫీ, ఎంపీడీఓ విజయలలిత, వైకే పీ ఏపీఎం గుణశ్యాం, ఏఓ మధుకర్, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

టపాసులు విక్రయిస్తే చర్యలు

కంబదూరు: వచ్చే నెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు లేవని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. విజయోత్సవ ర్యాలీలు,ఊరేగింపులు చేయరాదని, టపాసులు విక్రయించినా, కాల్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గమనించాలన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

బ్రహ్మసముద్రం : మండలంలోని అన్ని గ్రామ సచి వాలయాల రికార్డులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీం గోవింద గౌడ్, జనీనా బేగం, డీపీహెచ్ఎన్ హేమలత గురువారం పరిశీలించారు. అనంతరం మండల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, మహేష్, హెల్త్ అసిస్టెంట్లు జాన్సన్, మురళి, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ నగదును లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

కూడేరు: దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన కూడేరు శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో లెక్కించారు. తొలుత దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు జోడు లింగాలకు ప్రత్యేక పూజలు చేయించారు. రెండు శాశ్వత హుండీలలో కలిపి రూ.3.24 లక్షలు కానుకలుగా సమర్పించినట్లు దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామదుర్గం కిష్టప్ప, కమిటీ సభ్యులు మెకానిక్ శంకర్‌రెడ్డి, మీనుగ లీలావతి, రెంటాల శ్రీనివాసులు, పద్మావతి, అలివేలమ్మ, ప్రతిభా భారతి,ఆలయ కమిటీ సభ్యులు సంగప్ప, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటకు చెందిన నామాల హనుమంతురాయుడు (60) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి దుద్దేకుంటకు వెళ్లి హనుమంతరాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతుడి భార్య సాకమ్మ, కుమారులు రుద్రతేజ, అమర్‌నాథ్‌రెడ్డి, త్రివేణి, జ్యోత్స్న పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, గ్రామ సర్పంచ్ రత్నమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బీసీ సెల్ అధ్యక్షుడు సీపీ వీరన్న, నాయకులు త్రిలోక్‌రెడ్డి, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు ముత్తులూరి అశోక్, దుద్దేకుంట నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హనుమంతురాయుడు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

27న ఆలయ భూముల కౌలు వేలం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులో ఈనెల 27న ఉదయం 11 గంటలకు రామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ భూములు కౌలుకు ఇవ్వడానికి వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. గురువారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబరు 28లోని 10.72 ఎకరాలు, ఓబులేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబరు 56 బీ లోని 11.32 ఎకరాలు, మరో సర్వే నంబరు 99 లోని 5.19 ఎకరాలు, ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సర్వేనంబరు 264లోని 23.28 ఎకరాలను కౌలుకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

ఉరుసు ఉత్సవాలు వాయిదా

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళలో శుక్రవారం నుంచి జరగాల్సిన షాబాజ్ దివాన్ వలీ ఉరుసు ఉత్సవాలు వాయిదా వేసిన్నట్లు దర్గా ముతవలి, ఖాజీ యూసఫ్ వలి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఉరుసు ఉత్సవాలు జరిపేందుకు మరోసారి తేదీలను నిర్ణయిస్తామన్నారు.

విద్యుత్ మోటారు అపహరణ

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో షేక్ చాంద్‌బాషా అనే రైతు పొలంలో విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఎత్తుకెళ్లారు. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జాగ్రత్తలు పాటించాలి

బెళుగుప్ప: ప్రస్తుతం తొలకరి వర్షాలు కురుస్తున్నాయని, గొర్రెలు, మేకలు కొత్త గడ్డి మొలకలను తింటే రోగాలు వచ్చే ప్రమాదం ఉందని పశువైద్య అధికారి రమేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని యలగలవంక, యలగలవంక తండాలో జీవాలున్న రైతులు, కాపరులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

- ఆత్మ పీడీ మద్దిలేటి

రాయదుర్గం రూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఆత్మ పీడీ మద్దిలేటి తెలిపారు. గురువారం మండలంలోని జుంజురాంపల్లి రైతు భరోసా కేంద్రంలో ఆయన జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజాకుమారి, ఏఓ శ్రీనివాసులతో కలిసి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందస్తు వర్షాలు కురిశాయని, రైతులు లోతుగా దుక్కులు చేసుకోవాలన్నారు. పంటలు సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేయాలని సూచించారు. క్రిమి సంహారక మందులు, ఎరువులు ఇష్టానుసారంగా వేయకుండా తగు మోతాదులో వాడాలన్నారు. అనంతరం విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకు జాబితా ప్రకారం టోకన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తన వేరుశనగ టోకన్లు పంపిణీ చేస్తున్న ఆత్మ పీడీ మద్దిలేటి

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

రాయదుర్గం: ప్రభుత్వ రాయితీ విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు శుక్రవారం నుంచి రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ నెల 18 నుంచి 11,640 మంది రైతులు 10,282 క్వింటాళ్ల విత్తన కాయల కోసం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5,355 క్వింటాళ్లు వేరుశనగ అందుబాటులో ఉంచామని, పంపిణీ చేపట్టగానే మిగిలిన స్టాకు తెప్పిస్తామన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కే–6 రకం 90 కేజీలకు బహిరంగ మార్కెట్లో పూర్తి ధర రూ.8,500 అయితే రాయితీ రూ.3,280 వర్తిస్తుందన్నారు. రైతు వాటాగా రూ.5,130 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కదిరి లేపాక్షి రకం 90 కేజీలు బహిరంగ మార్కెట్లో రూ.7,830 కాగా, రాయితీ రూ.3,132 ఉండగా, రైతు వాటా రూ.4,698 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలి

గుమ్మఘట్ట: బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ తెలిపారు. రేపటి తరానికి వెలుగునిచ్చే ఆడపిల్లలను సమాజంలో బతకనిద్దామన్నారు. గురువారం మండలంలోని 75 వీరాపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాసిక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి, ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజమ్మ, మేరి , ఆయా వర్కర్లు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు



మెచ్చిరి గ్రామంలో మాట్లాడుతున్న అర్బన్ సీఐ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరిలో కార్డెన్ సర్చ్‌లో భాగంగా పోలీసులు రౌడీషీటర్లు, పాతకేసుల్లో నిందితుల ఇళ్ల , పశువుల పాకలు, గడ్డివామిదొడ్లలో గురువారం సోదాలు చేశారు. రికార్డులు లేని 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అర్బన్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్, కణేకల్లు ఎస్‌ఐలు, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీపీకి చేరిన వరదనీరు



బీటీపీ ప్రజెకటులో పెరిగిన నీటి మట్టం

బ్రహ్మసముద్రం : మూడు రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షానికి కర్ణాటకలో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. దీంతో వరద నీరు వేదావతి నదిలో వరద ప్రవాహం పెరిగి బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల మధ్య ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టులోకి చేరింది. బుధవారం సాయంత్రం ప్రాజెక్టు నీటిమట్టం 1,640.8 అడుగులు కాగా, గురువారం సాయంత్రానికి 1,641.3 అడుగులకు చేరింది. వరద నీరు చేరక ముందు ప్రాజెక్టులో 1,635 అడుగులు డెడ్ స్టోరేజ్ మాత్రమే ఉంది. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం పెరగడంతో అటు గుమ్మఘట్ట, ఇటు బ్రహ్మసముద్రం మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీటీపీకి కొనసాగుతున్న వరద నీరు

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టుకు రెండో రోజు వరదనీరు కొనసాగుతోంది. బుధవారం నాటికి 40.1 అడుగులు ఉన్న వరదనీరు..గురువారం నాటికి 41.2 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు వరదనీరు ఇంకా వస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

కూలి గిట్టుబాటయ్యేలా పనులు చూపాలి



మాట్లాడుతున్న ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు

కణేకల్లు: ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 ప్రకారం గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఏపీడీ అసిస్టెంట్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో అమృత్‌సర్, మినీ అమృత్‌సర్ కింద పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటల పెంపకానికి రైతులకు ప్రోత్సహించాలన్నారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ స్కీమ్ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సోమన్నగౌడ్, హరి, ఈసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ

వజ్రకరూరు: ఉపాధిహామీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏపీఓ లక్ష్మీకాంత బాయి సూచించారు. గురువారం మండలంలోని తట్రకల్లులో మినీ అమృతసరోవర్ పథకం ద్వారా చేపట్టిన పూడికతీత పనులను ఏపీఓ లక్ష్మీకాంతబాయి తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మస్టర్‌ను తనిఖీ చేశారు. ఏపీఓ మాట్లాడుతూ కూలీలు రోజూ ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు పని చేయాలన్నారు.

పౌష్టికాహారం అందించాలి

వజ్రకరూరు: కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. గురువారం స్థానిక ఏడో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.